# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 సంచిక: 65 పేజీలు: 4 వెల: రూ.4/- సోమవారం 3 నవంబర్ 2025 ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




# ప్రపంచ కప్ మనదే..

## చరిత్ర సృష్టించిన భారత అమ్మాయిలు




భారత మహిళల క్రికెట్‌లో సువర్ణాధ్యాయం లిఖితమైంది. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు ఫలితం దక్కింది. తొలిసారి టీమ్‌ఇండియా ప్రపంచకప్‌ను ఒడిసిపట్టుకుంది. అత్యంత ఆసక్తిగా జరిగిన మహిళల ప్రపంచకప్ ఫైనల్‌లో భారత జట్టు అదరగొట్టింది. దక్షిణాఫ్రికాను 52 పరుగుల తేడాతో చిత్తుచేసింది. దీంతో మైదానంలోని ఆటగాళ్లతో పాటు, టీవీ, మొబైల్ తెరలకు అతుక్కుపోయిన అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఈ ఉద్విగ్న క్షణం కోసం ఏళ్లతరబడి ఎదురుచూసిన భారతావని ఒక్కసారిగా పులకించిపోయింది.

-(నమస్తే ఉదయం)

# బాహుబలి ప్రయోగం సక్సెస్

## మరో అరుదైన ఘనత సాధించిన ఇస్రో

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే ఉదయం)

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో మరో అరుదైన రికార్డ్ సృష్టించింది. బాహుబలి రాకెట్ సక్సెస్‌ఫుల్‌గా ప్రయోగించింది. షార్‌లోని రెండో లాంచ్ పాడ్ నుంచి, ఎల్వీఎం 03-ఎం5 రాకెట్‌ని ప్రయోగించారు. ఈ రాకెట్ ద్వారా, తొలిసారిగా అత్యంత భారీ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టారు. సాయంత్రం 5.26 గంటలకు షార్‌లోని రెండో లాంచ్ పాడ్ నుంచి బాహుబలి రాకెట్ ఎల్వీఎం3-ఎం5 ద్వారా జమీ-03 సమాచార ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపారు. 4,410 కిలోల బరువున్న సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ GTOలోకి ప్రవేశపెట్టారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన సీఎంఎస్-03 ఉపగ్రహం.. కౌంట్ డౌన్

..మిగతా 2లో



## జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక...

# సీఎం రేవంత్ కీలక సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే ఉదయం) : జూబ్లిహిల్స్ ఉప ఎన్నిక స్టేట్ రాజకీయాల్లో పొలిటికల్ హీట్ పెంచుతోంది. పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రమవుతోంది. గెలుపు కోసం మూడు ప్రధాన పార్టీలు నువ్వా నేనా అన్నట్లుగా దూసుకుపోతున్న నేపథ్యంలో ఈ సెగ్మెంట్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ నేపథ్యంలో మంత్రులు, జూబ్లీహిల్స్ బైపోల్ ఇన్‌చార్జిలతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. జూబ్లీహిల్స్ లోని సీఎం క్యాంపు కార్యాలయంలో లంచ్ మీట్ ఏర్పాటు చేశారు. అనంతరం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై సమీక్ష నిర్వహించారు. జూబ్లీహిల్స్ ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఎట్టి పరిస్థితుల్లో ఈ స్థానాన్ని గెలిచి తీరాల్సిందేనని నేతలకు దిశానిర్దేశం చేశారు.

# పెద్దోళ్లకు ఒక న్యాయం.. పేదోళ్లకు ఒక న్యాయం

## హైడ్రా అరాచకాలపై బీఆర్ఎస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే ఉదయం)

పెద్దవాళ్లకు ఒక న్యాయం.. పేద వాళ్లకు ఒక న్యాయం నినాదంతో తెలంగాణ భవన్‌లో ఎగ్జిబిషన్ నిర్వహించారు. హైడ్రా అరాచకాలపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాబోయే 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని, హైడ్రా వల్ల అన్యాయానికి గురైన బాధితులకు న్యాయం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు ఎంతో మంది బాధితులుగా మారారు. మూసీ వల్ల, హైడ్రా వల్ల ఎంతో మంది బాధితులుగా మారారు. చాంద్రాయణ గుట్టలో స్కూల్ కూడా కూలగొట్టారు. కేసీఆర్ హయాంలో ఎక్కడ చూసినా కట్టడాలే కనిపిస్తాయి. హైదరాబాద్‌లోనే లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించాం. వైట్ హౌస్‌ను తలదన్నేలా సచివాలయం కట్టాం. దేశంలోనే అతిపెద్ద పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కట్టుకున్నాం. హైదరాబాద్‌లో 42 ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు కట్టుకున్నాం. ప్రతి జిల్లాలో కలెక్టరేట్‌లు కట్టుకున్నాం, నీటి ప్రాజెక్టులు కట్టుకున్నాం. ఒకటి రెండు కాదు.. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ కొత్త నిర్మాణాలు చేసుకున్నాం అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ఈ రెండేళ్లలో ఒక్క ఇటుక పెట్టలేదు.. ఒక్క కొత్త కట్టడం లేదు. ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి చేసింది ఏంటి అంటే.. కూలగొట్టడమే. ఈ ప్రభుత్వం వల్ల జరిగిన అన్యాయానికి ఎంతో మంది



బాధితులుగా మారారు. 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం రానుంది. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం. ఎవ్వరు కూడా ఇంత అన్యాయంగా, కిరాతకంగా పనిచేయాలని కోరుకోరు. పేదవాడికి ఒక న్యాయం.. ఉన్నవాడికి ఒక న్యాయం.. ఇది ఈ ప్రభుత్వ పనితీరు. ఒక ఇంటి గృహప్రవేశం చేసి వారం రోజులు కాలేదు.. బుల్డోజర్ వచ్చి కూలగొట్టింది. ఒక గర్భిణిని పక్కకు తోస్తే ఎలా ఉ ంటుందో అంతా ఆలోచించాలి. మూడేళ్ల చిన్నారి భోజనం లేకండా ఏడ్చిన పరిస్థితి. హైడ్రా బాధితుల బాధ అందరికీ అర్థం కావాలి అని కేటీఆర్ అన్నారు. హైడ్రాపై భట్టి విక్రమార్క పెద్ద ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ రోజు భట్టి విక్రమార్క ఇచ్చిన ప్రజంటేషన్‌లో చాలా విషయాలు చెప్పారు. ఆయన చాలా బిల్డర్ల పేర్లు చెప్పారు కానీ.. మేం ఏ బిల్డర్‌ను ఇబ్బంది పెట్టదలుచుకోలేదు.. పేదవాడి ఇంటికి బుల్డోజర్ వచ్చింది.. ఆ బిల్డర్ల జోలికి ఎందుకు వెళ్లలేదో ప్రభుత్వం చెప్పాలి. పేదలు కోరుకునేది ఒక్కటే కూడు గూడు గుడ్డ.. అలాంటి పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేసింది. ప్రభుత్వానికి అంతా సమానమైతే పెద్ద వాళ్ల జోలికి ఎందుకు వెళ్లలేదు.. వారికి ఎందుకు నోటీసులు ఇవ్వలేదు? పేదలకు న్యాయం చేయాలనుకుంటే.. ఫైవ్ స్టార్ హోటళ్లలో సమావేశాలు ఎందుకు పెడుతున్నట్లు? రూల్స్ అతిక్రమిస్తే కాపాడాలని మనమేం చెప్పట్లేదు. పేదల ఇళ్లు కూలగొట్టలేదని హైడ్రా కమిషనర్ చెబుతున్నారు. పేపర్లు, కోర్టు తీర్పులు ఉన్నా కూడా.. టైమ్ ఇస్తే కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంటారని చెబుతున్నారు.

## ఆపరేషన్ సిందూర్‌తో కాంగ్రెస్‌కు

# నిద్రలేని రాత్రులు

## బిహార్ ఎన్నికల ప్రచారంలో మోడీ కాంగ్రెస్, ఆర్జేడీపై నిప్పులు

న్యూఢిల్లీ, నవంబర్ 2 (నమస్తే ఉదయం)

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా జరిగిన ఆపరేషన్ సిందూర్ షాక్ నుంచి పాకిస్థాన్, కాంగ్రెస్ పార్టీ ఇంకా కోలుకోలేకపోయాయని ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఆ ఆపరేషన్ సమయంలో దాయాది దేశంలో ఉగ్రస్థావరాలపై బాంబులు పడుతుంటే.. ఇక్కడ కాంగ్రెస్ రాజకుటుంబం నిద్రలేని రాత్రులు గడిపిందని విమర్శించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆరాలో నిర్వహించిన ప్రచార సభలో ప్రతిపక్షాలపై ప్రధాని

..మిగతా 2లో



## ఓట్ల కోసం ప్రధాని మోదీ

# ఏం చేయడానికైనా సిద్ధమే

## కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, నవంబర్ 2 (నమస్తే ఉదయం)

లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ప్రధానిపై విమర్శలు చేశారు. ఆదివారం బీహార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాహుల్.. ఓట్ల కోసం ప్రధాని నరేంద్ర మోదీ ఏం చేయడానికైనా వెనకాడబోరని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ బీహార్‌కు వచ్చి అనేక ప్రసంగాలు, వాగ్దానాలు చేస్తారని, ఎన్నికల తర్వాత రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడరని రాహుల్ విమర్శించారు. బీహార్‌లో ప్రధాన సమస్యగా ఉన్న నిరుద్యోగం గురించి ప్రశ్నలు లేవనెత్తకుండా యువత దృష్టిని మళ్లించడానికి వారిని రీల్స్ చూడాలని మోదీ కోరుతున్నారని రాహుల్ ఆరోపించారు. రాష్ట్రంలో తమ

..మిగతా 2లో



# పెద్దోళ్లకు ఒక న్యాయం.. పేదోళ్లకు ఒక న్యాయం

మొదటి పేజీ తరువాయి...



ఫుల్ ట్యాంక్ లెవల్లో కడితే ఎవరిని వదలం అని చెప్పి పెద్దలను వదిలేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెరువును పూడ్చి ఇల్లు కట్టారు. ఈయన రాష్ట్ర రెవెన్యూ మంత్రి.. ఆయన ఇంటికి వెళ్లే ధైర్యం హైడ్రా కమిషనర్ చేస్తారా? మరో మంత్రి వివేక్ కూడా హిమాయత్ సాగర్ చెరువు వద్ద ఇల్లు కట్టుకున్నారు. వీళ్లను ముట్టే ధైర్యం హైడ్రా చేస్తుందా? రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ లోపల ఇల్లు కట్టుకున్నారు. సున్నం చెరువులో ఇల్లు కట్టుకున్న పేదలది తప్పు.. దుర్గం చెరువులో కట్టిన తిరుపతి రెడ్డిది ఏ తప్పులేదు. పేదలకు అసలు టైమ్ ఇవ్వరు.. తిరుపతి రెడ్డికి టైమ్ ఇచ్చి కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేలా చేస్తారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెరువు మధ్యలోనే ఇల్లు కట్టుకున్నారు. ఆయనకు నోటీసులు ఇచ్చే ధైర్యం హైడ్రాకు ఉందా? మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి చెరువులోనే ఇల్లు కట్టుకున్నారు. వాళ్ల దగ్గరకు వెళ్లి.. వారికి నోటీసులు ఇచ్చే దమ్ము అధికారులకు ఉందా? పెద్ద పెద్ద ఫామ్ హౌజ్‌లు, ఇల్లులు కట్టుకున్నా అడిగేవారు లేరు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ.. గాజులరామారంలో 11 ఎకరాలకు ప్రభుత్వమే అండగా ఉంది. పేదలను వెళ్లగొట్టి గాంధీకి మాత్రం అండగా నిలిచారు. మాకు హద్దులు చూపించడం లేదు.. హద్దులు విషయంలో ఇబ్బందులు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్‌లో చేరితే ఒక న్యాయం.. ఇతరులకు మరో న్యాయం ఉంటుందా? ఈ షీట్‌లు వేసింది కూడా అధికారులే అని కేటీఆర్ తెలిపారు. మూసీ నదిలో అడ్డంగా కట్టిన బిల్డింగ్‌ను కూడా ఇప్పటి వరకు ఆపలేదు.. ఆ ధైర్యం హైడ్రాకు ఉందా? పెద్ద బిల్డర్లు కడితే వారికి సహకరించి.. తానా తందానా ఆడతారు. మూసికి అడ్డంగా ఆకాశమంత పెద్దగా కడితే కూడా వారికి కనిపించదు. మంత్రులు, పెద్ద పెద్ద నాయకులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.. కానీ పేదల పైకి బుల్డోజర్లు పంపిస్తారు. అందుకే మేం హైడ్రాను వ్యతిరేకించేది. బుల్డోజర్ నా శరీరంపై నుంచి వెళ్లాలని యూపీలో రాహుల్ గాంధీ మాట్లాడారు. అదే తెలంగాణలో బుల్డోజర్ ఇళ్లను కూలగొడుతుంటే రాహుల్ గాంధీ ఏం చేస్తున్నారు? ఇది తప్పు అని.. రేవంత్ రెడ్డికి ఎందుకు చెప్పట్లేదు? అని కేటీఆర్ నిలదీశారు.

కొండాపూర్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న కొందరికి ప్లాట్లు ఇచ్చారు. వారిని కూడా హైడ్రా వెళ్లగొట్టింది. హైడ్రా చేసేది న్యాయమే అయితే.. అర్ధరాత్రి ఎందుకు వస్తున్నట్లు? నోటీసులు ఇవ్వడానికి ప్రభుత్వానికి ఏంటి ఇబ్బంది? పేపర్లు చూడటానికి ఏం ఇబ్బంది ఉంది? ఇదే రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూలగొట్టడం తప్పు అని మాట్లాడారు. తప్పు జరిగితే రెగ్యులరైజ్ చేయండి అని చెప్పంది కూడా రేవంత్ రెడ్డే. ఆర్మీ కుటుంబాన్ని కూడా ప్రభుత్వం ఇబ్బంది పెట్టింది. తెలియక తప్పు జరిగితే సరిదిద్దాలని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎందుకు కూలగొడుతున్నారు? ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి పేదల ఇళ్లను కూలగొడుతున్నారు. ఈ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్న నమ్మకం మాకు లేదు. మీకు మళ్లీ హామీ ఇస్తున్నా.. మీకు న్యాయం చేసే బాధ్యత నాది. 500 రోజులు ఆగితే కేసీఆర్ ప్రభుత్వం వస్తుంది.. బాధితులకు అండగా ఉంటాం. మేం పదేళ్లలో ఏ ఒక్కరికి అన్యాయం చేయలేదు.. అదే బాధ్యతతో మన ప్రభుత్వం వచ్చిన తర్వాత హైడ్రా బాధితులకు న్యాయం చేస్తాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.



## నేడు శంషాబాద్, రాజేంద్రనగర్‌లలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

రాజేంద్రనగర్/శంషాబాద్,నవంబర్02(నమస్తే ఉదయం) విద్యుత్ వినియోగదారుల దినోత్సవ వేడుకలు నవంబర్ 3(సోమవారం)న శంషాబాద్ లోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు శంషాబాద్ విద్యుత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రమేష్ తెలిపారు.ఈ విద్యుత్‌వినియోగదారుల దినోత్సవ వేడుకల్లో వినియోగదారుల ఫిర్యాదులు తీసుకుంటామని చెప్పారు.పరిష్కార వేదికలో బిల్లింగ్ లోపాలు, తక్కువ వోల్టేజ్ సమస్య,ఇతర సమస్యలు పరిష్కరించుకోవచ్చని చెప్పారు.ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని అధికారులకు నేరుగా తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు.

**రాజేంద్రనగర్ లో..**

నవంబర్ 3(సోమవారం)న రాజేంద్రనగర్ లోని ఫిష్ బిల్డింగ్ వద్ద గల విద్యుత్ కార్యాలయం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ విద్యుత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు.తమ ప్రాంతంలో ఉన్న విద్యుత్ సమస్యలు తెలియజేయాలన్నారు.ఈ విద్యుత్ వినియోగదారుల దినోత్సవ వేడుకల్లో వినియోగదారుల ఫిర్యాదులు తీసుకుంటామని చెప్పారు.పరిష్కార వేదికలో బిల్లింగ్ లోపాలు, తక్కువ వోల్టేజ్ సమస్య,ఇతర సమస్యలు పరిష్కరించుకోవచ్చని చెప్పారు.ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని అధికారులకు నేరుగా తమ సమస్యలను విన్నవించుకోవచ్చని తెలిపారు.


## నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార దినోత్సవం

రాజేంద్రనగర్, నవంబరు 2 (నమస్తే ఉదయం) : ఈ నెల 3వ తేదీన ఉదయం 10 : 30 గంటల నుంచి సులేమాన్ నగర్ ఫిష్ బిల్డింగ్ దగ్గర గల రాజేంద్రనగర్ సబ్ డివిజన్, సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం ను నిర్వహిస్తున్నారు. ఇతర వివరాలకు ఏడీఈ రాజేంద్రనగర్ 8712470138, ఏ ఈ రాజేంద్రనగర్ 8712470086 నెంబర్ లలో సంప్రదించాలని కోరారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు ఈ సందర్భంగా పరిష్కరించడం జరుగుతుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్2(నమస్తే ఉదయం)అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందింది. మృతురాలి మెడలో నుంచి 4 తులాల బంగారు ఆభరణాలు మాయమవడంతో మృతురాలి భర్త మాత్రం హత్యగా భావిస్తున్నారు. వివరాలోకి వెళ్లితే...గద్వాల పట్టణం శేరెల్లి వీధికి చెందిన బలిజ లక్ష్మి(50), మల్లికార్జున్ ఇద్దరు భార్యభర్తలు. భర్త ఓ ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే భర్త షాప్ కెళ్లి మధ్యాహ్న ఇంటికి రాగ భార్య లక్ష్మీ అనుమానస్పదంగా మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే ఆసుపత్రికి వెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగ మృతురాలి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసు కనిపించకపోవడంతో భర్త గద్వాల టౌన్ పోలీసులకు పిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని గద్వాల సీఐ టి.శ్రీను, టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్, రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు.క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ ఆధారాలు సేకరించాయి. మృతురాలి భర్త మల్లికార్జున్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కళ్యాణ్ కుమార్ తెలిపారు. ఇదీ ఇలా ఉండగా మృతురాలు బలిజ లక్ష్మీ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తోందని, ఈ క్రమంలో ఏమైనా ఎవరైన అఘాయిత్యానికి పాల్పడార లేదా అనారోగ్యంతో మృతి చెందిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



పాగుంట వెంకన్న స్వామిని దర్శించుకున్న కేటి దొడ్డి ఎస్సై శ్రీనివాసులు



కేటి దొడ్డి నూతన ఎస్సై శ్రీనివాసులు సన్మానిస్తున్న మార్కెట్ యాడ్ చైర్మన్ హనుమంతు

## పాగుంట వెంకన్న స్వామి ఆశీస్సులతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

### కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్2(నమస్తే ఉదయం)కేటిదొడ్డి మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంట శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారిని ఆదివారం కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. శాలువాతో సత్కరించి, ఆలయ విశిష్టతను వివరించారు.

**కేటిదొడ్డి ఎస్ఐని సన్మానించిన మార్కెట్ యార్డు చైర్మన్**

కేటిదొడ్డి మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన పి.శ్రీనివాసులును ఆదివారం గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, మండలాధ్యక్షులు ఉరుకుందు, మండల నాయకులు యుగేందర్ గౌడ్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై పి. శ్రీనివాసులు మాట్లాడుతూ... గ్రామాలలో అందరు కలిసిమెలిసి ఉండాలని, శాంతిభద్రతలకు అందరు సహకరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, అనేలైన్ సైబర్ మోసగాళ్ల వలలో పడకూడదని ఎవ్వరైనా అనుమాస్పదంగా ఊర్లలోకి వస్తే మాకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎస్ఐని సన్మానించిన వారిలో నాయకులు కొండయ్య, జంగిలప్ప, డి.వీరేష్, హెచ్ వీరేష్, రాఘవేంద్ర, రంగస్వామి, తదితరులు ఉన్నారు.



## మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (జవహర్ నగర్ కార్పొరేషన్) నవంబర్ 02 ( నమస్తే ఉదయం):-మేడ్చల్ నియోజకవర్గం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పల్లపు రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీని వీడి భారత రాష్ట్ర సమితి (బి ఆర్ ఎస్ ) పార్టీలో చేరారు. పల్లపు రవి తో పాటు దాదాపు 300మంది కాంగ్రెస్ కార్యకర్తలు బి ఆర్ ఎస్ పార్టీ లో చేరగా వీరందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పల్లపు రవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేద మధ్యతరగతి కుటుంబాల బతుకులు చిన్న భిన్నమైనయని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ ఆయాంలోని జవహర్ నగర్ కార్పొరేషన్ గా మారిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జవహర్ నగర్ ప్రజలపై సవతి తల్లి ప్రేమను వలకబోస్తుందని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ లో జరుగుతున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, నాయకులు రాజశేఖర్, జిట్టా శ్రీనివాస్ రెడ్డి, రెడ్డి శెట్టి మహేష్, రంగుల సతీష్, సిద్దులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాహుబలి ప్రయోగం సక్సెస్

మొదటి పేజీ తరువాయి...

ప్రక్రియ 24గంటల సమయం పాటు నిర్విరామంగా కొనసాగింది.. ఆ తర్వాత సరిగ్గా ఇవాళ సాయంత్రం 5.26 నిమిషాలకు నిప్పులు చిమ్ముతూ నింగికి ఎగిరింది బాహుబలి రాకెట్. ఈ ప్రయోగం విజయవంతంతో ఇస్రో మరో మైలు రాయిని చేరుకుంది.. ఈ ప్రయోగం ద్వారా అంతరిక్షంలోకి పంపుతున్న జమీా-03 కమ్యూనికేషన్ ఉపగ్రహం పది సంవత్సరాల పాటు కక్ష్యలో పరిభ్రమిస్తూ సేవలు అందిస్తుంది.

**జమీా-03 ఎందుకంత స్పెషల్..?**

ప్రయోగించిన రాకెట్టూ స్పెషలే.. అందులో ప్రయాణించి కక్ష్యలోకి ఎంట్రీ ఇచ్చిన శాటిలైట్ కూడా స్పెషలే. బాహుబలి1, బాహుబలి2 అని చెప్పుకోవచ్చు. ఇంతకీ జమీా-03 ఎందుకంత స్పెషల్..?

4,400 కేజీలు బరువు కలిగిన జమీా-03 భూమి నుంచి 36 వేల కిలోమీటర్ల ఎత్తున కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఇంత బరువైన ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపించడం ఇదే మొదటిసారి. అందుకే దీన్ని బాహుబలి శాటిలైట్ అంటున్నారు.

CMS-03.. దీనికి GSAT-7R అని మరో పేరుంది. ఇది పూర్తిగా కమ్యూనికేషన్ రిలేటెడ్ శాటిలైట్. పది సంవత్సరాల పాటు కక్ష్యలో పరిభ్రమిస్తూ సేవలు అందిస్తుంది.

ఈ శాటిలైట్ ద్వారా సమాచార వ్యవస్థ మెరుగుపడ్డంతో పాటు సముద్ర వాతావరణ పరిస్థితులను తెలుసుకునే వెసులుబాటు కలుగుతుంది.

గతంలో జీశాట్-7 అనే ఉపగ్రహాన్ని ఫ్రెంచ్ గయానా నుంచి ఇస్రో ప్రయోగించింది. దీని కాలపరిమితి ముగియడంతో సరికొత్త టెక్నాలజీతో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో GSAT-7R శాటిలైట్‌ను రూపొందించి, నింగికి పంపారు.

భారత భూ భాగంలోని మారుమూల అటవీ ప్రాంతాలు, సముద్ర ప్రాంతాల్లో మెరుగైన ఇంటర్నెట్ సేవలు అందించడంలో ఈ శాటిలైట్ ఉపయోగపడుతుంది.

**తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఇస్రో చైర్మన్ నారాయణన్**

ఈ బాహుబలి రాకెట్ అండ్ బాహుబలి శాటిలైట్ ప్రయోగం నేపథ్యంలో, తిరుమల శ్రీవారిని ఇస్రో చైర్మన్ నారాయణన్ దర్శించుకున్నారు. శాటిలైట్ ప్రయోగం సక్సెస్ కావాలని శ్రీవారికి మొక్కులు చెల్లించారు.

## ఆపరేషన్ సిందూర్‌తో కాంగ్రెస్‌కు నిద్రలేని రాత్రులు


మొదటి పేజీ తరువాయి...

మోదీ విరుచుకుపడ్డారు. 'జంగల్‌రాజ్'ను బీహార్ ప్రజలు మర్చిపోలేదని, ఆ నేతలు చరిత్రలోనే అత్యంత దారుణమైన ఓటమిని చవిచూడబోతున్నారని విమర్శించారు. ఆర్జేడీకి అనుకూలంగా సీఎం అభ్యర్థిని ప్రకటించాలని కాంగ్రెస్ అనుకోలేదని, తేజస్వి యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా అంగీకరించేందుకు హస్తం పార్టీ ఎప్పుడూ సిద్ధంగా లేదని, కాంగ్రెస్ తలపై తుపాకీ ఎక్కుపెట్టి మరీ ఆర్జేడీ ఆ అవకాశాన్ని దక్కించుకుందని ఆరోపించారు. ఎన్నికల అనంతరం ఆ పార్టీల నేతలు పరస్పరం పోట్లాడుకుంటారని మోదీ చెప్పారు. మహా కుంభమేళాను ఇరుపార్టీల నేతలు అవమానించారని, ఓ కాంగ్రెస్ నేత ఛఠ్ పూజను అపహాస్యం చేశారని, ఇకపై ఎవరూ అలా చేసేందుకు ధైర్యం చేయలేనంతగా గుణపాఠం నేర్పాలి ఓటర్లను కోరారు. జాతీయ భద్రతకు, సైన్యానికి మా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌ను అమలు చేస్తున్నామని, జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశామని చెప్పారు. ఉగ్రవాదులను వారి గడ్డపైనే శిక్షించాలని ప్రతిజ్ఞ చేశామని, ఆపరేషన్ సిందూర్ రూపంలో దాన్ని నెరవేర్చామని ప్రధాని అన్నారు. పొరుగు దేశంలోని ఉగ్రస్థావరాలపై దాడులు చేస్తున్నప్పుడు కాంగ్రెస్ రాజకుటుంబానికి నిద్ర కరవైందని విమర్శించారు. ఇందిరాగాంధీ హత్య అనంతరం చెలరేగిన హింసను ప్రస్తావిస్తూ.. 1984లో దాదాపు ఇదే సమయంలో ఢిల్లీలో సిక్కులను ఊచకోత కోశారని, ఆ మారణహోమం విషయంలో కాంగ్రెస్ ఇంకా క్షమాపణ చెప్పలేదని, దోషులను ప్రోత్సహిస్తోందని అన్నారు.

## ఓట్ల కోసం ప్రధాని మోదీ ఏం చేయడానికైనా సిద్ధమే

మొదటి పేజీ తరువాయి...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు ఉత్తమ విద్య, ఉద్యోగ అవకాశాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నలంద వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాన్ని బీహార్‌లో ప్రారంభిస్తామన్నారు. ఇండియా కూటమిని గెలిపిస్తే రాష్ట్రంలో రైతులు, కార్మికులు, దళితులు, బలహీనవర్గాలకు అనుకూలమైన ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు. భారత్-పాకిస్థాన్ సైనిక ఘర్షణను ఆపానని ట్రంప్ పదేపదే చెబుతున్నప్పటికీ.. ఆయనను నిలదీసి ప్రశ్నించే ధైర్యం మోదీకి లేదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నోట్ల రద్దు, జీఎస్టీ సంస్కరణలు వంటి నిర్ణయాలన్నీ దేశంలోని కొందరు వ్యాపారవేత్తలకు ప్రయోజనం చేకూర్చేవేనన్నారు. కానీ తాము మాత్రం చిరు వ్యాపారులు అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ముందుకు వెళ్తామని చెప్పారు. మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలపై మేడిన్ బీహార్ అనే ముద్రను చూడాలనుకుంటున్నామని తెలిపారు.



అంబేద్కర్ విగ్రహనికి నిత్య పూలమాల కార్యక్రమంలో పాల్గొన్న బొడిగే శ్రీనివాస్

## రాజ్యాంగ స్ఫూర్తితోనే ప్రతి ఒక్కరు ముందుకు సాగాలి.

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( ఘట్కేసర్ మున్సిపల్ ) ఆగస్టు 02 ( నమస్తే ఉదయం ) ఘట్కేసర్ ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 238వ వారం నిత్య పూలమాల కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బొడిగె శ్రీనివాస్ గౌడ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ డా.బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని మనం అందరం ముందుకు తీసుకెళాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భారతదేశం ప్రపంచపటం లో ఉండేలా అంబెద్కర్ కు మాత్రమే సాధ్యమైంది అన్నారు. ప్రపంచంలోనే అత్యంత ప్రజాస్వామిక దేశంగా భారతదేశానికి వన్నె తెచ్చారని గుర్తు చేశారు. సామజిక అణిచివేతలని, అంటరానితనాన్ని, నిర్మూలనకి అంబెద్కర్ చేసిన కృషి అమోఘం అన్నారు. ఆయన ఒక సామాజిక సంస్కర్త, సామజిక తత్వవేత్తగా కీర్తి గడించారని కొనియాడారు. బీసీ, ఎస్సి, ఎస్టి, మైనారిటీ లతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలు అందరూ కలిస్తే బహుజన రాజ్యాధికారం వస్తుందని అని తెలిపారు. ఈ కార్యక్రమాలతో ప్రజలని చైతన్య పరుస్తున్న యం.అరుణ్ కుమార్ కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. 1948 నవంబరు 4న భారత రాజ్యాంగ పరిషత్తులో డా.బాబాసాహెబ్ అంబెద్కర్ భారత రాజ్యాంగము ముసాయిదా డా.రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతి సమర్పించి 77 సంవత్సరాలు గడుస్తుదని చెప్పారు. భారత రాజ్యాంగం రూపొందించటానికి అంబెద్కర్ చేసిన కృషిని దేశ ప్రజలు మరువరని గుర్తుచేశారు. ఈ కార్యక్రమం లో మేకల దాసు అంబెద్కర్ యువజన సంఘము, కె.నర్సింగ్ రావు, బండారి రాందాస్ అద్యక్షులు, అంబేద్కర్ యువజన సంఘం, ఈడబ్లుఈస్ కాలనీ, కె. సత్యం, మీసాల రాజేష్ కుమార్ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ, ఎస్సి సెల్, పోచారం మున్సిపాలిటీ, తహల్కా రాములు, బాలానగర్ సురేష్ గౌడ్, ఇ జగదీష్, తోక రాజు, గంగారాం అంజయ్య, టి శ్రీరామ్, ఎస్. కృష్ణం రాజు, ఎం సంతోష్, సి ఆనంద్, సి నిఖిల్, ఇ విష్ణు, డి శివ కృష్ణ, సి ముఖేష్, లలిత్ ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.


# జిల్లాలో ముమ్మరంగా పంట నష్టం అంచనా

### నష్ట పోయిన పంట ను పరిశీలించి అంచనా నివేదికలు తయారు చేయాలి

### జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని



జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 02(నమస్తే ఉదయం):ముంథా తుఫాన్ తాకిడికి గురై నష్టపోయిన రైతుల క్షేత్రాలను వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా పలు రైతు క్షేత్రాలను పర్యటించారు. ఈసారి పంట నష్టం వివరాల నమోదు కొరకు కొత్తగా ప్రవేశపెట్టిన యాప్ ద్వారా పంట నష్టం వివరాలు రైతు వారీగా సేకరిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో తుఫాను తాకిడికి రైతులు వరి, పత్తి పంట నష్టపోయినందున దానికి సంబంధించిన వివరాలను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో పర్యటించి నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని జిల్లాలోని దేవరుప్పల మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన దారపు మధు, దారపు కుమార్ కి చెందిన 6 ఎకరాల పత్తి పంటను పరిశీలించారు. తర్వాత పాలకుర్తి మండలం లోని లక్ష్మీనారాయణ పురం గ్రామం, గూడూరు గ్రామాలను, జాఫర్‌గఢ్ మండలంలోని తిడుగు గ్రామంలో భారీ వర్షంతో నీటి ప్రవాహం కారణంగా పూర్తిగా కొట్టుకుపోయిన పంటను ఎండబెట్టడానికి ఉంచిన రైతు కడారి సమ్మయ్యతోనూ, పంట నష్టం గురించి పత్రికల్లో ప్రచురించబడిన సాగరం గ్రామానికి చెందిన రైతు తీగల శ్రీనివాస్ తోనూ సంభాషించాను.ఈ సందర్భంగా డిఏఓ అంబికా సోని మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఒక్క నష్టపోయిన రైతును, అధికారులు క్షేత్ర స్థాయిలో కలిసి నష్ట పోయిన పంట ను పరిశీలించి అంచనా నివేదికలు తయారు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.



టీఆర్పిలో చేరిన వివిధ పార్టీల నాయకులు

## జనగామ జిల్లా నుంచి టీఆర్పిలో చేరికలు

### సాధారంగా ఆహ్వానించిన మల్లన్న.

**జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 02(నమస్తే ఉదయం):**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ జిల్లా అధ్యక్షురాలు చెరుకూరి మౌనిక యాదవ్ అధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సమక్షంలో జిల్లా నుండివివిధ పార్టీ ల వారు టిఆర్పి పార్టీలో చేరారు.పార్టీ లో చేరిన వారికి మల్లన్న పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలన్నారు. నాయకులు, కార్యకర్తలు నిబద్ధత , అంకిత భావంతో పనిచేసి పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలిని పిలుపనిచ్చారు పార్టీలో చేరిన వారు ఎస్కె షరీఫ్, నరేష్, మదన్, సురేష్, అశోక్, తదితరులు ఉన్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు గాడి పెల్లి యాకన్న, జిల్లా నాయకుడు చిర్ర వీరస్వామి, శాడ నరేష్, భానుచందర్, ముక్క విష్ణు, గుర్రాల సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 02(నమస్తే ఉదయం): జిల్లా కలెక్టరేట్ లో సోమవారం రోజున జరిగే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో, వివిధ శాఖల అధికారులు, క్షేత్ర స్థాయి లో నష్ట ప్రభావం పై ప్రాథమిక అంచనా కోసం సర్వే చేస్తున్న కారణంగా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.నేటి ప్రజావాణి రద్దు విషయాన్నీ జిల్లా ప్రజలు గమనించాలని, కలెక్టర్ కార్యాలయంలో ఎటువంటి వినతులు స్వీకరించరని, కలెక్టర్ తెలిపారు.



## ఇంతటితో వదిలిపెట్టను

### మాధవరం అక్రమాలు బయటపెడతా

### అరికపూడి సంచలన ప్రకటన

**హైదరాబాద్, నవంబర్ 2 (నమస్తే ఉదయం)**



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు అరికపూడి గాంధీ బహిరంగా సవాల్ చేశారు. 2009 నుంచి ఇద్దరి ఆస్తులపై విచారణ తాను సిద్ధమని ప్రకటించారు. సిట్టింగ్ జడ్జీ లేదా? ఈడీ విచారణను ఎదుర్కోవడానికైనా రెడీ అంటూ ఛాలెంజ్ చేశారు. సర్వే నెంబర్ 307లో మా కుటుంబ సభ్యులు 9 మంది కలిసి ఆ 11 ఎకరాల భూమి కొనుగోలు చేశారని వివరణ ఇచ్చారు. ఆ 11 ఎకరాల భూమిపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. ఆ భూములతో సంబంధం లేదని స్వయంగా హైకోర్టే చెప్పిందని గుర్తుచేశారు. ఆ 11 ఎకరాల భూముల వివరాలు అడిగితే బీఆర్ఎస్ నేతలకు ఇవ్వడానికి కూడా తాను సిద్ధమే ప్రకటించారు. ఈ విషయాన్ని ఇంతటితో వదిలిపెట్టను.. త్వరలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అక్రమాలను బయటపెడతానని సంచలన ప్రకటన చేశారు. అక్రమాలు చేశానంటూ తనపై నిందలు వేస్తే ఊరుకోను.. ఆరోపణలు నిరూపించకపోతే ప్రజాకోర్టులో శిక్ష ఖాయమని హెచ్చరించారు. ఎవరి చరిత్ర ఏంటో ప్రజలకు తెలుసని అన్నారు.



గురుద్వార్ లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## గురుద్వార్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 2(నమస్తే ఉదయం) మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని అల్వాల్ డివిజన్ లో గల గురుద్వార సంగత్ సాహిబ్ సభ, గురు నానక్ మందిరం వద్ద శ్రీ గురు నానక్ దేవ్ జీ మహారాజ్ 556వ జయంతి సందర్భంగా ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, గురుద్వారంలో గురు గ్రంథ్ సాహిబ్ కి నమస్కరించి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... “సర్వ మత సౌహార్దం, సేవాభావం, సమానత్వం వంటి విలువలను బోధించిన శ్రీ గురు నానక్ దేవ్ జీ ఉపదేశాలు ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తాయి. గురు నానక్ జీ బోధనలు సమాజం అభివృద్ధికి మార్గదర్శకాలు” అని పేర్కొన్నారు.అల్వాల్ పరిధిలో గురుద్వార కమిటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు తన పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గురుద్వార సంగత్ సాహిబ్ సభ ప్రబంధక్ కమిటీ సభ్యులు జస్బీర్ సింగ్, అమన్‌దీప్ సింగ్, వర్జిందర్ సింగ్, కమిటీ సభ్యులు, అలాగే బీఆర్ఎస్ నాయకులు తోట నరేందర్ రెడ్డి, శరణ గిరి, సురేష్, యాదగిరి, ప్రేమ్, అరుణ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.




## భారతదేశ ఐక్యతకు ప్రతి ఒక్కరు తనవంతు కృషి చేయాలి

### 3కే రన్ ప్రారంభించిన బాలానగర్ ఎస్ఐ సరిత రెడ్డి..

**కూకట్ పల్లి, నవంబర్ 2 (నమస్తే ఉదయం)**

దేశ ఐక్యతకు ప్రతిఒక్కరూ తన వంతు కృషిచేయాలని బాలానగర్ ఎస్ఐ సరిత రెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం స్వామీ వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ‘రన్ ఫర్ నేషన్’ స్ఫూర్తితో 3కే రన్ ను జండా ఊపి ప్రారంభించారు. బాలానగర్ డివిజన్ పరధిలోని ఐడిపిఎల్ డిమార్ట్ వద్ద ప్రారంభమైన ర్యాలీ గూడెన్మెట్ క్రాస్ రోడ్స్ మీదుగా కుత్బుల్లాపూర్ క్రాస్ రోడ్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఎస్ఐ సరిత రెడ్డి మాట్లాడుతూ దేశ ఐక్యత, సమగ్రతకు సర్దార్‌వల్లభాయ్ పటేల్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ఆలోచనలు, విలువలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్, స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనాథ్, కిషర్ బాబు, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమమే ధ్యేయంగా.. అభివృద్ధే లక్ష్యంగా

# సాగుతున్న ప్రజాపాలనను ఆశీర్వదించండి

### జూబ్లీహిల్స్ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించగల నాయకుడు నవీన్ యాదవ్ మాత్రమే

### టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం

కూకట్ పల్లి, నవంబర్ 2 (నమస్తే ఉదయం) జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని, నవీన్ యాదవ్‌కు ఒక అవకాశం ఇచ్చి మీ విలువైన ఓటుతో ఆదరించాలని ఓటర్లను కోరుతు ఎర్రగడ్డ డివిజన్ కళ్యాణ్ నగర్ పరిధిలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ మోసిన్, మాజీ కార్పొరేటర్ కంజర్ల సదాశివ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజ్ కుమార్ గౌడ్, రూపేష్, మొహమ్మద్ సర్దర్, ఐలయ్య యాదవ్, శ్రీనివాస్ గౌడ, కళ్యాణ్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారావు, బివిఆర్ చౌదరి, రత్నకుమారి, రాజేశ్వరీ, లక్ష్మీ, రాజ్ కుమార్ గౌడ్, జై సూర్య, కమిటీ సభ్యులు పాల్గొని



ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదలు, రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగ పక్షాన ఉంటుంది. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, సన్నవడ్లకు 500 రూపాయలు బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, 10 లక్షల ఆరోగ్యశ్రీ పథకం, మహిళా సోదరిమనులకు ఉచిత బస్సు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉచిత సన్నబియ్యం, 200 యూనిట్స్ ఉచిత కరంట్, 500 రూపాయలకె ఉచిత గ్యాస్ నిరుద్యోగులకు 80000 ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంతరెడ్డి నాయకత్వంలో ప్రజా పాలనలో భాగంగా పేద ప్రజలకు ఇంటింటికి అందుతున్నాయి. రాష్ట్రంలో సమగ్ర అభివృద్ధి జరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహా యాదవ్, మస్తాన్ రెడ్డి, రాము గౌడ్, అరుణ్ గౌడ్, ఎం.రాము, శేఖర్ గజానంద్, కనకయ్య, శివ జెల్ల, మహేష్ ముదిరాజ్, రమాదేవి, గుండ జ్యోతి, భారతమ్మ, లావణ్య, అనిత, కృష్ణవేణి, అహ్మద్, పల్లపు వేణు, చందు, యాదగిరి, సతీష్ రెడ్డి, రవి ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, మైనారిటీ నేతలు, యువజన కాంగ్రెస్ సభ్యులు భారీగా పాల్గొన్నారు.




## ఎడ్ల శోభకు ఆర్థిక సహాయం చేసిన పదవ తరగతి స్నేహితులు

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 02 (నమస్తే ఉదయం): జనగామ జిల్లాలోని దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన 2001- 02 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు, చిన్న నాటి స్నేహితులు పదవ తరగతి వరకు కలసి చదువుకున్న స్నేహంతో ఎడ్ల శోభ భర్త ఇటీవల అనారోగ్యంతో చనిపోగా 2 నెలల తరువాత అనివార్యం కారణాలతో కొడుకు చనిపోవడంతో శోభ కుటుంబం తీవ్రమైన శోక సముద్రంలో కూరుకుపోయింది. విషయం తెలుసుకున్న స్నేహితులు ఆదివారం స్నేహితురాలు శోభ తన అత్త వారి ఊరి తిర్మలగిరిలో ఉన్న ఇంటి వద్ద 2001- 02 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు మొత్తం కలసి 25వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసి శోభకు మనో ధైర్యం కల్పించారు. అలాగే శోభ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని చిన్న నాటి స్నేహితులు ఆమెకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు రచ్చ వెంకటేష్, భాషిపాక రమేష్, వంగూరి నర్సింహా ఇ.బాలాజీ, బి.రాజన్న, ఎన్.రాజ శేఖర్, ఎండీ.హసీనా, పి.కుమార్ (చిన్న), పి.భవాని, డి.శ్రీను, ఎం.రవి నాయక్, బి.గోవర్ధన్, వి.నర్సింహా, ఎన్.భాస్కర్, ఎం.భాస్కర్, బి.మాధవి, జె.వెంకట్, వి.రేణుక, పి.సరిత, బి.కవిత, బ్రహ్మము, ఎన్.నర్సమ్మ, పెద్ది కుమారస్వామి, ఎన్.ఈర్య తదితరులు పాల్గొన్నారు.

# నవజ్యోతి యూత్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తా : ఎస్ఎం హుస్సేనీ ముజీబ్



నవ జ్యోతి యూత్ క్లబ్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్



నవ జ్యోతి యూత్ క్లబ్ పూర్వ కమిటీ కార్యవర్గానికి సన్మానం

బుద్వేల్, నవంబరు 2 (నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ నా పుట్టిన ఊరు అని, ఈ ప్రాంతం అభివృద్ధికి ఎల్లప్పుడు కట్టుబడి ఉన్నానని టి ఎన్ జీ ఓస్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి, సేవారత్న, డాక్టర్ ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ అన్నారు. రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ కు నూతనం గా ఎన్నికైన అధ్యక్షుడు మంగలారం శ్రీనివాస్ అధ్యక్షతన కమిటీ సభ్యులు ఆధివారం పూర్వ కమిటీ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ ఎం హుస్సేనీ ముజీబ్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నవజ్యోతి యూత్ క్లబ్ కు విశాలమైన క్రీడా మైదానం ఉందన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి కలిగి నిరంతరం ప్రాక్టీస్ చేయాలన్నారు. మా చిన్న తనంలో రాజేంద్రనగర్ క్రీడాకారులు రంగారెడ్డి జిల్లా స్థాయిలో బాగా రాణించేవారని గుర్తు చేసుకున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ సహకారం తీసుకుని నవజ్యోతి యూత్ క్లబ్ కమ్యూనిటీ హాల్ కు నూతన భవనం నిర్మించడానికి ముందుకు వెళదామన్నారు. క్రీడా పోటీల నిర్వహణ కోసం తన పూర్తి సహయ సహకారాలు ఉంటాయన్నారు.యువత క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. విలువైన సమయాన్ని సెల్ ఫోన్ లతో కాలక్షేపం చేయవద్దని సూచించారు. త్వరలోనే రాజేంద్రనగర్ లో మహిళల కోసం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల క్యాంపు నిర్వహిద్దామని క్లబ్ నూతన కమిటీ సభ్యులకు సూచించారు. నవజ్యోతి యూత్ క్లబ్ మాజీ అధ్యక్షులు, రంగారెడ్డి జిల్లా క్రికెట్ జట్టు మాజీ అధ్యక్షులు ఎస్ జగదీశ్వర్ మాట్లాడుతూ, నవజ్యోతి యూత్ క్లబ్ అంటే క్రీడలకు ప్రసిద్ధి అని గుర్తు చేశారు. తాను కబడ్డి హైదరాబాద్ జిల్లా తరపున జోనల్ స్థాయిలో కడప లో ఆడటం జరిగిందని గుర్తు చేశారు. బ్యాడ్మింటన్ ఆడేవాడినని, రంగారెడ్డి జిల్లాకు క్రికెట్ క్యాప్టెన్ గా వ్యవహరించానని గుర్తు చేశారు. యువత క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. క్లబ్ మాజీ కోశాధికారి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ మాట్లాడుతూ, నవజ్యోతి యూత్ క్లబ్ అభివృద్ధి కి తన వంతు శాయశక్తుల కృ షి చేస్తానన్నారు. క్లబ్ మాజీ అధ్యక్షులు, ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ అమరేందర్ మాట్లాడుతూ, కమిటీ లో ఉన్నా లేకున్నా యువత అందరు నవజ్యోతి యూత్ క్లబ్ అభివృద్ధి లో బాగస్వాములు కావాలన్నారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మంగలారం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్యామల గంగాధర్, ఉ పాధ్యక్షులు జి.మురళీమోహన్, పి.రవీందర్, సంయుక్త కార్యదర్శులు జి.యశ్వంత్ (నాని), ఈ శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.హరినాథ్. క్రీడల కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్, సాం స్కృతిక కార్యదర్శి డి.నర్సింహ్మారాజు, కోశాధికారి ఎం. వినయ్ కుమార్, ఉప కోశాధికారి ఎం.సాయి సందీప్, మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేముల వెంకటేశ్, ఎస్ వెంకటేశ్, లక్ష్మణాస్, జి. శ్రీనివాస్, ఎం.శ్రీకాంత్, శ్రీకాంత్, క్లబ్ పెద్దలు డాక్టర్ వి.శ్రీరాములు, వి.లక్ష్మీనారాయణ, ఎం.ఎ నయీమ్, పి.ఈశ్వర్, వి.యాదగిరి, వై.గోపాల్, కరణం యాదయ్య ముదిరాజ్, ఎ.భీమయ్య, డి.ఉమారెడ్డి, ఎం.నాగభూషణం, కనకమామిడి ప్రవీణ్ కుమార్, వీర్లపల్లి మహేశ్ కుమార్,వీర్లపల్లి నవీన్ కుమార్, అక్కిరాజు సుబ్బారావు, పి, ఉదయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పలుగుచెరువు మహేశ్, అనుముల జాన్ పాల్ జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.



క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

## మన్నా చర్చిలో ఇంటర్నేషనల్ సండే స్కూల్ డే వేడుకలు

బుద్వేల్, నవంబరు 2 (నమస్తే ఉదయం) : ఇంటర్నేషనల్ సండే స్కూల్ డే సందర్భంగా రాజేంద్రనగర్ లోని మన్నా చర్చిలో ఆదివారం చిన్నారులు ఆరాధన ను నడిపించారు. చర్చి పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సీహెచ్ ప్రభావతి ల సమక్షంలో ఈ ఆరాధన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సండే స్కూల్ చిన్నారులను తర్ఫీదు చేసే ఓ శిక్షణాలయం లాంటిదన్నారు. చిన్నారులు మంచి మార్గంలో నడుచుకోవడానికి సండే స్కూల్ ఎంతోగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ ఆరాధనలకు మాళవిక అధ్యక్షత వహించగా, బైబిల్ సందేశాలను శాంతి అందజేశారు. చిన్నారులు లేవీ, యువాన్ష్ లు ప్రత్యేక పాఠ పాడి వినిపిం చారు. చిన్నారులందరు బైబిల్ గ్రంధంలో ఉన్న ఆధ్యాత్మిక పుస్తకాలను కంఠస్థం చేసి వినిపిం చారు. కన్నుల పండువగా జరిగిన ఈ చిన్నారుల ఆరాధనలో సంఘ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్లు సంగీత ప్రసన్న, సుష్మా, సుస్మిత, శాంతి, స్వప్న లు పాల్గొన్నారు.



బైక్ పై పెట్రోలింగ్ చేస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ యోగేష్ గౌతం

## బైక్‌పై పెట్రోలింగ్ చేస్తున్న డీసీపీ యోగేశ్ గౌతమ్

బుద్వేల్, నవంబరు 2 (నమస్తే ఉదయం) : నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన ధ్యేయమని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ యోగేశ్ గౌతమ్ అన్నారు. శనివారం రాత్రి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలను ఆయన బైక్ పై ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు తో కలసి పెట్రోలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల ఇళ్లను అకస్మికంగా తనిఖీ చేశారు. వారి సమస్యలను, జీవన విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. నేరాల జోలికి వెళ్లకు ండ క్రమశిక్షణ తో జీవించాలని సూచనలు చేశారు. నేరాల నియంత్రణ లో ప్రజలు సహకారం అందజేయాలన్నారు. అనుమాన స్థితిలో ఎవరైన కనిపించిన, వాహనాలు కనిపించిన వెంటనే 100 కు డయల్ చేయాలన్నారు.



చిన్నారులతో కోనేటి ప్రార్థన మందిరం పాస్టరమ్మ సిస్టర్ ఎస్ యేసు మణి

## కోనేటి ప్రార్ధన మందిరంలో ఇంటర్నేషనల్ సండే స్కూల్ డే వేడుకలు

బుద్వేల్, నవంబరు 2 (నమస్తే ఉదయం) : చిన్నారులను చిన్ననాటి నుంచి దైవ భక్తిలో పెం చడానికి సండే స్కూల్ లు దోహదపడతాయని బుద్వేల్ కోనేటి ప్రార్ధన మందిరం పాస్టరమ్మ సిస్టర్ ఎస్ యేసుమణి అన్నారు. అంతర్జాతీయ సండే స్కూల్ డే సందర్భంగా ఆదివారం తమ సంఘంలో చిన్నారుల చేత బైబిల్ కంఠస్త వాక్యాలు, స్తుతి ఆరాధనలు చేయించారు. చిన్ననాటి నుంచి చిన్నారులు మంచి మార్గంలో నడచుకోవాలంటే దైశభక్తి అవసరం అన్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు సండే స్కూల్ కు పంపించాలని సూచించారు.



బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ లో రోడ్డు పై నిలచి ఉన్న మురుగు నీటిని చూస్తున్న పెండ్యాల సాయి మల్లిక్



మ్యాన్ హెూల్‌ను శుభ్రం చేయిస్తున్న సాయి మల్లిక్

## డ్రైనేజీ పైపు లైన్‌ను బాగు చేయించిన పెండ్యాల సాయి మల్లిక్

బుద్వేల్, నవంబరు 2 (నమస్తే ఉదయం) : బుద్వేల్ సిరిహైట్స్ అపార్ట్మెంట్ సమీపంలో డ్రైనేజీ మ్యాన్ హెూల్ ఉప్పొంగి ఆదివారం రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న శ్రీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెండ్యాల సాయిమల్లిక్ బాగు చేయించారు. డ్రైనేజీ మ్యాన్ హెూల్ ఉప్పొంగడంతో రోడ్డంతా మురుగునీటితో నిండిపోయి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురైనారు. దుకాణాల ముందు మురుగునీరు వచ్చి చేరడంతో దుకాణదారులు కూడా అవస్థలు పడ్డారు. ఈ విషయాన్ని శ్రీ శ్రీనివాస సేవా సమితి అధ్యక్షుడు పెండ్యాల సాయిమల్లిక్ దృష్టికి స్థానికులు తీసుకురాగా అయన స్పందించి జలమండలి సిబ్బం దీని పిలిపించి బాగు చేయించారు.



సాయిరెడ్డి కాలనీలో దుర్గా డయాగ్నస్టిక్ సెంటర్ ను ప్రారంభించిన మైనంపల్లి హనుమంతరావు.

## పేద ప్రజలకు డయాగ్నస్టిక్ సెంటర్ అనువుగా ఉండాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (అల్వాల్ సర్కిల్ ) ఆగస్ట్ 2 (నమస్తే ఉదయం) ఆదివారం అల్వాల్ సాయిరెడ్డి నగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గా డయాగ్నస్టిక్ సెంటర్ కు ముఖ్య అతిథులుగా మైనంపల్లి హనుమంతరావు, బసవరాజు సారయ్య లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు అనువుగా ఉండాలని వారు సూచించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ ల్యాబ్ వారి సౌజన్యంతో ప్రారంభించినట్లు డాక్టర్ పోతుల ఎల్లేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, బొబ్బిలి సురేందర్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




డాక్టరేట్ అందుకుంటున్న గుంటి రాజ్ కుమార్

## గుంటి రాజ్ కుమార్‌కు డాక్టరేట్

బుద్వేల్, నవంబరు 2 (నమస్తే ఉదయం): కావేరి డెవలపర్స్ అధినేత, బుద్వేల్ కు చెందిన గుంటి రాజ్ కుమార్ కు న్యూ ఢిల్లీ లో ఆదివారం జరిగిన ఓ వేడుకలో గౌరవ డాక్టరేట్ అందచేశారు. అమెరికా కు చెందిన చికాగో ఓపెన్ యూనివర్సిటీ పేరుతో తన సేవలను గుర్తించి గౌరవ డాక్టరేట్ అందచేశారని గుంటి రాజ్ కుమార్ తెలిపారు. రియల్ ఎస్టేట్ రంగంలో తన సేవలను గుర్తించి ఈ గౌరవ డాక్టరేట్ అందచేశారని ఆయన తెలిపారు. ఈ గౌరవం తమ సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి అంకితం అన్నారు.





ఆల్ సోల్స్ డే సందర్భంగా రాజేంద్రనగర్ శ్మశాన వాటికలో తమ కుటుంబీకుల సమాధులను పూలతో అలంకరించి ప్రార్ధనలు చేస్తున్న దృశ్యం



## 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్2(నమస్తే ఉదయం)ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఆదివారం గద్వాల రూరల్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. గద్వాల్ రూరల్ ఎస్ఐ సిహెచ్ శ్రీకాంత్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధరూర్ కు చెందిన తెలుగు క్రిష్ణ అనే వ్యక్తి గద్వాల్ పరిసర ప్రాంతాల్లోని ప్రజల వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి మిని డీసీఎం వాహనంలో తరలిస్తుండగా గోనుపాడు వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. 35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి తెలుగు క్రిష్ణ పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.






## అల్వాల్‌లోని శివాలయంలో స్క్రోలింగ్ బోర్డును ఇస్తున్న లక్షణామూర్తి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) ఆగస్టు 02 ( నమస్తే ఉదయం) అల్వాల్ వెస్ట్ వెంకటాపురం లోని శివాలయంలో స్క్రోలింగ్ బోర్డును ఎన్నం లక్ష్మణమూర్తి అందించారు. టిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ మూర్తి ఓం నమశ్శివాయ స్క్రోలింగ్ బోర్డ్ బోర్డ్ ఓం నమశివాయ డిస్ప్లే బోర్డు ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు అందరు పాల్గొన్నారు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733